క్లుప్తంగా

పాఠశాల ఆవరణలో వర్షపు నీరు



నీరు నిలవడంతో పక్క నుంచి వెళ్తున్న విద్యార్థులు

మొయినాబాద్: నాలుగు రోజులుగా వర్షాలు పడుతుండడంతో ఎక్కడ లోతట్టు ప్రాంతం ఉంటే అక్కడ నీరు నిలిచిపోతోంది. మండల పరిధిలోని వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పాఠశాల భవనం ముందే వర్షం నీరు నిలవడంతో విద్యార్థులు లోపలికి, బయటకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తాగునీటి సమస్యపై ఫిర్యాదు



మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌తో మాట్లాడుతున్న మహిళలు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని సింగాపూర్‌లో గత 10రోజుల నుంచి సరిపడా తాగునీరు రావడం లేదని శనివారం మహిళలు మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలం వచ్చినప్పటికీ తమ వార్డులో సరిపడా తాగునీరు రావడం లేదని, దీనిపై సంబంధిత అధికారులను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కమిషనర్, వార్డుకి సరిపడా నీరు అందించాలని అధికారులకు సూచించారు.

ఎంఆర్ఐ శివకుమార్‌కు పదోన్నతి



శివకుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న తహసీల్దార్ రమేశ్‌కుమార్, సిబ్బంది

కొందుర్గు: మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శివకుమార్‌కు పదోన్నతి లభించింది. శివకుమార్ గత మూడేళ్లుగా తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, ఎంఆర్‌ఐగా విధులు నిర్వహించాడు. ఆయన అందరితో కలుపుగోలుగా ఉంటూ, విధి నిర్వహణలో మంచి పేరుప్రతిష్టలు అందుకున్నాడు. కాగా శివకుమార్‌కు పదోన్నతి ఇచ్చినట్లు శనివారం సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదల కావడంతో తహసీల్దార్ రమేశ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాకేశ్, సీనియర్ అసిస్టెంట్ ప్రకాశ్, కార్యాలయ సిబ్బంది హరీష్, వీరంజన్, శ్రీనివాసు, బాబయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొందుర్గు: మండలంలోని చిన్నఎల్కిచర్ల, ఉత్తరాసిపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ లైన్‌ల కింద చెట్లకొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

అందుబాటులో యూరియా



కొత్తపేట పీఏసీఎస్ వద్ద చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, ఏఓ శిరీష

కేశంపేట: మండలంలో రైతులకు యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ గంట జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. శనివారం మండలంలోని కొత్తపేట గ్రామంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద పీఏసీఎస్ చైర్మన్, ఏఓ శిరీషతో కలిసి రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మండల పరిధిలోని కొత్తపేట, కేశంపేట, తొమ్మిదిరేకుల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో యూరియా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు తదితరులు ఉన్నారు.



మొయినాబాద్: వెంకటపూర్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు



మొయినాబాద్: పెద్దమంగళారం-చందానగర్ రోడ్డుపై ఏర్పడిన గుంత

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- గుంతల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్న వైనం
- రాకపోకలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



మొయినాబాద్: కంచిమోనిగూడ వద్ద ఛిద్రమైన రోడ్డు

మొయినాబాద్: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. అడుగడుగునా గుంతల పడటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం రాకముందు నుంచే గుంతలయమంగా ఉన్న రోడ్లు ఇప్పుడు వర్షాలకు మరింత అధ్వానంగా మారాయి. మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని చాలా గ్రామాల రోడ్లది ఇదే పరిస్థితి. మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్, పెద్దమంగళారం, అప్పోజీగూడ, అజీజ్‌నగర్ గ్రామాల రోడ్లపై గుంతలు ఏర్పడి వర్షం నీరు నిలిచింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని శ్రీరాంనగర్, వెంకటాపూర్, కనకమామిడి, చాకలిగూడ, నక్కలపల్లి, ఎత్‌బార్‌పల్లి, తోలుకట్ట, అప్పారెడ్డిగూడ, చందానగర్, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, మోత్కుపల్లి, చిన్నమంగళారం, బాకారం రోడ్లు మరీ అధ్వానంగా మారాయి. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి చాలా గ్రామాల రోడ్లు కోతకు గురయ్యాయి. దానికి తోడుగా నాలుగు రోజులుగా వర్షాలు పడుతుండడంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. ఈ రోడ్లపై వాహనాలు వెళ్తే పాడవుతున్నాయని.. గుంతల్లో వాహనాల కుదుపులకు నడుమునొప్పులు వస్తున్నాయని వాహనదారులు, స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



మొయినాబాద్: కనకమామిడి వద్ద చిత్తడిగా మారిన రోడ్డు

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



మాట్లాడుతున్న కేఎస్ రత్నం

షాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ఎంఎస్ గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరు మాణెయ్య అధ్యక్షతన పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కై వసం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాయలను ప్రజలకు వివరించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ మాట్లాడుతూ.. బీజేపీతోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో పార్టీ దేశవ్యాప్తంగా బలమైన శక్తిగా మారిందన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి కార్యకర్తలకు సలహాలు ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ప్రతీ కార్యకర్త శ్రమిస్తే విజయాన్ని అందుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పీసరి సతీష్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు కిరణ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

ఏఓ నిషాంత్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న ఏఓ నిషాంత్‌కుమార్

షాద్‌నగర్: రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. యూరియా పంపిణీ విషయంలో రైతులు అపోహలు నమ్మొద్దని సూచించారు. రైతులకు కావాల్సినంత యూరియా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలకు మేరకు ఫరూఖ్‌నగర్ మండలానికి ప్రతి రోజు 75 మెట్రిక్ టన్నుల యూరియా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు, రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో రైతులకు కావాల్సిన యూరియాను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. షాద్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ కో–ఆపరేటివ్ సొసైటీలో 25 మెట్రిక్ టన్నులు, కేశంపేట రోడ్డులో ఉన్న ఆగ్రో రైతు సేవా కేంద్రంలో 20 మెట్రిక్ టన్నులు, మన గ్రోమోర్ సెంటర్‌లో 10 టన్నులు, మొగిలిగిద్దలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో 25 మెట్రిక్ టన్నులు, రాఘవేంద్ర ఫర్టిలైజర్‌లో 1.2 మెట్రిక్ టన్నులు, వసుంధరా ఏజెన్సీలో 1.7 మెట్రిక్ టన్నులు, శ్రీ సాయి ఫర్టిలైజర్‌లో 1 మెట్రిక్ టన్ను, పరిగి రోడ్డులోని శ్రీకృష్ణ ఫర్టిలైజర్‌లో యూరియా నిల్వ ఉన్నట్లు వివరించారు. మొత్తం ఫరూఖ్‌నగర్ మండంలో 100 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

నందిగామ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో శనివారం పార్టీ మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్‌చారి అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆ పార్టీకి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలో తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రజలకు చేసింది శూన్యమేనన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు డిపాజిట్ దక్కకుండా చూడాలన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, నాయకులు నర్సింహాగౌడ్, మోహన్‌సింగ్, సుధాకర్, బంటారం లక్ష్మణ్‌గౌడ్, చెన్నయ్య, ప్రవీన్, శ్రీను, నర్సింహాగౌడ్, హేమంత్, ప్రభాకర్ చారి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌గుప్తా, కృష్ణ, జంగయ్య, భాను ప్రసాద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి



చేవెళ్ల: సీఐకి ఫిర్యాదు చేస్తున్న టీపీసీసీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు యాదిరెడ్డి, నాయకులు



షాద్‌నగర్‌రూరల్: ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పోలీస్‌స్టేషన్‌లలో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదులు

చేవెళ్ల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో నాయకులు వేరువేరుగా రెండు ఫిర్యాదులు అందజేశారు. శనివారం సీఐ భూపాల్‌శ్రీధర్‌కు కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ బి.యాదిరెడ్డి, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డికి ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు కరుణాకర్‌రెడ్డి వేరువేరుగా ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి ఆహర్నిషలు కృషి చేస్తున్న రేవంత్‌రెడ్డిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఏ అధికార హోదాతో సీఎంపై విమర్శలు చేస్తావని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు అనంద్, సురేందర్, మహేశ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండుయాదవ్ ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగదు

కొందుర్గు: సీఎం రేవంత్‌రెడ్డిపై పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, గోవర్ధన్‌గౌడ్, నరేందర్, జీబీ కృష్ణ, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు

శంకర్‌పల్లి: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, నాయకుడు గోపాల్‌రెడ్డితో కలిసి శంకర్‌పల్లి, మోకిల పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐలు స్పష్టం చేశారు.

షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో..

షాద్‌నగర్‌రూరల్: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ ఆదివాసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుశీల తెలిపారు.

పోలీసులకు ఫిర్యాదు

కేశంపేట: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ మండల నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అనసూయ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

కృత్రిమ మేధస్సును పెంపొందించుకోవాలి

మొయినాబాద్‌రూరల్: ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థులు కృత్రిమ మేధస్సుతో రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలపాలని జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి, మిషిన్ లర్నింగ్ ఇంజనీరింగ్ డీబీఎస్ టెక్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సీతారాం తాడేపల్లి అన్నారు. శనివారం అమ్డాపూర్ చౌరస్తాలో గల జేబీఐఈటీ కళాశాలలో 14వ గ్రాడ్యుయేషన్ ఉత్సవాన్ని జేబీ గ్రూప్ విద్యాసంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి బీటెక్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ డాక్టర్ ప్రొఫెసర్ ఇనాక్, విద్యాసంస్థల డైరెక్టర్ సంజయ్, జేబీఐఈటీ ప్రిన్సిపాల్ కృష్ణమాచారి, పార్మసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, రిటైర్డ్ అడిషనల్ డీఎస్‌పీ యాదయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



టాపర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రొఫెసర్ కిషన్‌కుమార్‌రెడ్డి

సభను విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్



మాట్లాడుతున్న ఉపేందర్

శంకర్‌పల్లి: చేవెళ్లలో ఆగస్టు 2న నిర్వహించే చేయూత పెన్షన్‌దారుల సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని దొంతాన్‌పల్లిలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, బీడీ కార్మికులకు రూ.4వేల ఇస్తామని చెప్పి మాట తప్పారని గుర్తుచేశారు. దాంట్లో భాగంగా ఆగస్టు 13న మందకృష్ణ మాదిగ నేతృత్వంలో పెన్షన్‌దారుల మహాగర్జన ఏర్పాటు చేశారని, సన్నాహకంగానే 2న చేవెళ్లలో సభ నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ, జిల్లా కార్యదర్శి శివశంకర్, నాయకులు ప్రవీణ్, యాదగిరి, భాను, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- **ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని, కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని దేవకి గార్డెన్‌లో శనివారం అర్హులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ రేషన్ కార్డు, పక్కా ఇళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం కొత్తగా రేషన్ కార్డులను అందజేస్తున్నామని తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఘన విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు అంజయ్య, అజీమ్, వెంకట్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, రఘురాములు, శ్రీనివాస్‌రెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం.. అప్రమత్తతే ఆయుధం!

- విద్యుత్‌తో తస్మాత్ జాగ్రత్త
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాలు హరి
- విద్యుత్ శాఖ ఏఈ కోటేశ్వరరావు



తాళ్లపల్లిలో రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

షాబాద్: వర్షాకాలంలో ఎక్కువగా విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ప్రాణాలు గాలిలో కలుస్తాయి. గాలి ధుమారం, భారీ వర్షం కురిసిన సమయంలో కరెంట్ తీగలు తెగిపడతాయి. వాటిని గమనించకుండా వెళ్తే ప్రమాదాలు సంభవిస్తాయి. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే ఉండాలని ఈ ముప్పులను అధిగమించవచ్చు. వానాకాలంలో గృహ వినియోగదారులతో పాటు రైతులు విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంటే మంచిదని ఏఈ కోటేశ్వరరావు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వర్షం కురుస్తున్న సమయంలో లేదా వర్షం తగ్గిన వెంటనే ఎట్టి పరిస్థితుల్లో కరెంట్ పోల్‌ను ముట్టుకోవద్దు.
- ఉరుములు, మెరుపులతో వర్షం పడుతున్నప్పుడు కరెంట్ తీగల కింద నిలబడడం, నడవడం చేయకూడదు.
- వర్షం పడుతున్నప్పుడు సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టొద్దు. సాధ్యమైనంతవరకు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేయాలి.
- విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను ముట్టుకోవద్దు. ఎక్కడైనా చెట్ల కొమ్మలు కరెంట్ తీగలకు తగులుతున్నట్లు గ్రహిస్తే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- ఇంటిపైకి ఎక్కి కరెంట్ తీగల సమీపానికి వెళ్లొద్దు. తీగలపై పడిన దుస్తులను కర్రలతో కానీ లోహంతో తయారు చేసిన రాడ్లతో కానీ తీయకూడదు.
- వర్షం పడుతున్న సమయంలో ఆరుబయట ఉన్న విద్యుత్ వైర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ మరమ్మతులు చేయరాదు.

గృహ సముదాయాల్లో..

- ఇంట్లో ఉన్న స్విచ్‌లను, ఇతరాత్ర కరెంట్ వస్తువులను పిల్లలు ముట్టుకోకుండా చర్యలు తీసుకోవాలి.
- తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను, వైర్లను ముట్టుకోవద్దు.
- ఇంట్లో ఉన్న వాటర్ హీటర్, రైస్ కుక్కర్, స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతే ముట్టుకోవాలి.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుంటే డిష్ కనెక్షన్ తొలగించడం మంచిది.
- ఇంట్లో ఎక్కడైనా విద్యుత్ వైరుకు ఇనుప వస్తువులు తగులుతున్నాయో చూడాలి. ఎక్కడైనా ఇనుప వస్తువుకు వైర్లు తగులుతున్నట్లు గ్రహిస్తే వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి తొలగించే చర్యలు చేపట్టాలి.
- ఇంట్లోకి వచ్చే సర్వీసు వైర్ డ్యామేజ్ అయితే ఆలస్యం చేయకుండా సరి చేసుకోవాలి. సాధ్యమైనంత వరకు కొత్త సర్వీసు వైర్ ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.
- ప్రతి ఇంట్లోనూ విధిగా ఎర్త్ వైర్ ఏర్పాటు చేసుకోవాలి. ఆదేతీరుగా ప్రతీ కరెంట్ వస్తువుకు ఎర్త్ వైర్ బిగించుకోవడం శ్రేయస్కరం.



వ్యవసాయ భూముల వద్ద..

- వ్యవసాయం సాగు చేస్తున్న రైతులు విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి. బోరు పంపు వద్ద, వ్యవసాయ బావుల వద్ద తడి చేతులతో స్టార్టర్‌ను తాకొద్దు.
- విద్యుత్ వైర్ల కింద ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబడొద్దు. గాలి వీయడం వల్ల ప్రమాదవశాత్తు విద్యుత్‌లైన్ తీగలు తెగిపడే అవకాశాలు ఉంటాయి. అటువైపు వెళ్లడం కానీ, పశువులను మేపడం కానీ చేయవద్దు.
- వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ తీగలు సవరించడం కానీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వెళ్లి తడి చేతులతో ఫ్యూజ్ తీయడం వంటివి చేయవద్దు.